

# వానజల్లు

వానజల్లు విడిచి విడిచి పడుతున్నది. మధ్య మధ్య నీరెండ యవనికమీద నీడలా వచ్చి, పరామర్శించి పోతూంది. చిత చిత లాడుతున్న రోడ్డు మీద ఆ వీధి కుర్రకారు ఆటలాడుకుంటున్నారు. ఎండ, వాన రెండూ కలిసి వస్తూంటే "కుక్కకు, నక్కకు పెళ్లి" అని అరుస్తూ గిర్రున తిరుగుతున్నారు.

'కుక్కకు, నక్కకు పెళ్లేమిటి, వీళ్ల మొహం?' అనుకుంటూ సన్నగా నవ్వుకున్నాడు సీతాపతి.

ఝల్లుమని పెద్దగా ఓసారి వాన వచ్చి పిల్లలందరినీ తడిపేసింది. హోరుమని అల్లరి చేస్తూ పారిపోయారు వాళ్లు. సీతాపతి నసుక్కుంటూ లేచి, మడత కుర్చీ కాస్త వెనక్కు జరిపి కూర్చున్నాడు.

వరండాలో తడిసిన భాగం క్రమేపి ఎక్కువవుతూంది. ఎముకలుకొరికేలా చలిగాలి కూడా వీస్తూంది. లోపలికి వెళ్లిపోవాలనుకున్నాడు సీతాపతి. కానీ కదలలేదు. లోపలికి వెళ్లితే మళ్లీ పుస్తకాల్లో తల దూర్చుకుంటాడు. అదీ అతని భయం. అతను అలా భయపడటంలో న్యాయం లేకపోలేదు. లోకానికి సీతాపతి చాలా సంస్కారపరుడు. బాగా చదువుకున్నవాడు. తీరిక సమయాల్లో అతని ఉబుసుపోక ఎప్పుడూ—చిన్నప్పటి నుంచీ—పుస్తకమే. అది అతని కెప్పుడూ విసుగు పుట్టలేదు. అందుకే అతని భయం. ఎప్పుడూ విసుగుపుట్టలేదు కాబట్టి ఇకమీదట విసుగుదల తోచవచ్చు. అరవై ఏళ్లు పైబడ్డాయి. ముసలితనం బాగా ముసిరింది. ముసలితనంతో అన్నిటి మీదా విసుగుదల, విరక్తి కలుగుతుంది. కాస్త జల్లు ఎక్కువైతే, వానమీద విసుక్కున్నాడు లోపలికి పారిపోవాలనుకున్నాడు. కాని పుస్తకాల తోటి అతని బంధాన్ని కూడా ముసలితనానికి

బలిపెట్టకూడదని అతని ఉద్దేశం. అలా జరిగిన పక్షంలో అతని జీవిత శేషంలో అతనికి తోడూ, నీడా కూడా ఉండదు. కాలం తన ఇనుప అడుగులను భారంగా కదిలిస్తుంది. భీకరంగా ఆవులిస్తుంది. ఆ ఆవులింతలో అతను కరిగిపోగలడు. ఆ ఊహే అతని భయానికి మూల కారణం. కాలమంటే ఏమిటో ఇప్పుడిప్పుడే అతను గుర్తించగలుగుతున్నాడు. ఇన్నాళ్లూ కాలానికి అతను గుడ్డివాడు. గతంలో అతనెన్నడూ 'రేపు'ను గురించి ఆలోచించలేదు. అందుకు కారణం పిచ్చిగా, తప్పుగా అతను అర్థం చేసుకున్న ఉమర్‌ఖయ్యామ్ ప్రభావం. ఆ రేపును మరిచిన అతను ఈనాడు ఒంటరితనంలో, బాధలో మునిగి తేలుతున్నాడు. "ఉమర్‌ఖయ్యాం వేదాంతం ఊబిలాంటిది. బాహ్యార్థాలు విస్మరించి, అంతర్లీన భావాలను గ్రహించుకో" అని ఆనాడే ఒక స్నేహితుడు బోధించాడు. కాని తను పెడచెవిని ఒగ్గి, తన పెడదారిని మానలేదు. తత్ఫలితంగా—బహుశః తత్ఫలితంగానే ఏమో—తన వికృష్ట జీవితానికి రోసి, తన భార్య ఆమె కథ ముగించుకుంది. తుదకు తత్ఫలితంగానే తన ఒక్కగాని ఒక్క కొడుకు....

సీతాపతి గబుక్కున లేచి లోపలికి వెళ్లాడు. కాని నిప్పును తాకిన చేయిలా వెనక్కి వచ్చాడు. లోపల నాలుగు గోడల మధ్య అతను ఒంటరిగా ఉండలేడు. వసారాలో మడత కుర్చీస్థలం మార్చి, మళ్లీ కూర్చున్నాడు. అతను పడే తాపత్రయం అంతా అతని ఆలోచనాపరంపరను తెంపడానికి; చీకటిలో నీడలా మూగుతున్న గతాన్ని తరమడానికి. గతాన్ని అతను అసహ్యించుకుంటున్నాడు. కాని ఈ సీతాపతే ఆరేడేళ్ల క్రితం భవిష్యత్తును నిరసించుకునేవాడు. తప్పక రేపో మాపో వర్తమానాన్ని కూడా అసహ్యించుకుంటాడు. అంతటితో అంతమవుతుంది, అతనిలోని జీవితాశ.

వాన తగ్గినట్లుంది. ఆకాశం ప్రకాశవంతమయింది. మళ్లీ చేరింది పిల్లల గుంపు వీధిలోకి. "కుక్కకు, నక్కకు పెళ్లి" అని అరుస్తున్నారు పిల్లలు.

"ఒరేయ్, సీతాపతీ! నీకూ, కమలకీ పెళ్లి" అన్నారు నాన్నగారు. తన పెళ్లి సంగతి చెప్పి, కడపటిసారి అన్నట్లు హెచ్చరించారు—"ఇక మీదటనైనా మంచిగా ప్రవర్తించు" అని. తనంటే తన తండ్రికి గిట్టలేదు. సంఘానికి సాసగలేదు. అందుకు కారణం తన ప్రవృత్తి. అది తన ప్రకృతి. తనేం చెయ్యగలడు? తను సౌందర్యారాధన అన్నాడు. లోకం కుటిల ప్రవర్తన అంది. తల్లిలేని తనను తండ్రి గట్టిగా మందలించలేకపోయాడు. యుక్త వయస్సులో ఆ వయసుకు పట్టపగ్గాలు లేకపోగా, మురికి గుంటలాంటి ఆ అలవాట్లతోనే తను చదువు ముగించాడు. ఉద్యోగం వెలగబెట్టాడు. తండ్రిని మానసికంగా కూలదోశాడు. కాని తనకు ఎవ్వరూ పిల్లనివ్వరేమో అన్న తన తండ్రి భయం నిజంకాలేదు. అయిన సంబంధమే అయిన కమలతో తనకు పెళ్లి జరిగింది. అయినా తన మార్గాలలో మార్పుమాత్రం జరగలేదు. ఉద్యోగం మిషతో ఎప్పుడూ ఊళ్లు తిరుగుతుంటే, తన వ్రతం — సౌందర్యోపాసన — సాగిపోతుంటే విధి తనను అడుగడుగుకూ మరింత లోతుకు తోసింది. చాలాకాలం వరకు బాధను హృదయంలో దాచుకుంది భార్య. ఆ హృదయం నిండి వెలి గ్రక్కింది. ఆ దుఃఖాగ్నిలో మలమల మాడిపోయింది ఆమె ప్రాణం. ఆమె ఆర్తి తీర్చేటందుకు కనీసం ఒక్క కసిగందును కూడా ప్రసాదించలేదు ఆ భగవంతుడు. అన్నివిధాలా కుంగిపోయి అప్పుడప్పుడు ఆమె కనుకొలకుల్లో నిలిచేవి ఆమె ప్రాణాలు. అందుకు దోహదంగా ఆమెకు మూర్ఛల రోగం తోడయింది.

తప్పు చేయని మనిషి ఉండడు చేయనివాడు తెలుసుకోనూలేడు. ఒకటి మాత్రం నిజం. చేసినది తప్పని ఎప్పటికైనా తెలుసుకొనగలశక్తి, అంతకుమించి నిజాయితీ ఉంటే తప్ప ఇది సాధ్యంకాదు. కాని తప్పే ఒప్పని నమ్మి చేస్తూపోతే!

అప్రయత్నంగా కళ్లు తుడుచుకున్నాడు సీతాపతి.

మళ్లీ ఒక్కసారి వానజల్లు విజృంభించింది. ఈసారి పెద్దగా వర్షమే కురుస్తున్నది. గాలి కూడా రివ్వుమని వీస్తోంది. పెద్ద పెద్ద చినుకులు వరండాను చాలావరకు తడిపేస్తున్నాయి. సీతాపతి కాళ్ళు, పంచె అంచుకూడా బాగా తడిసిపోతున్నాయి. అయినా అతను లేవలేదు. ఇంటి కప్పుమీదినుంచి జారి అంచునుంచి ఒక్కొక్కటిగా రాలుతున్నాయి వర్ష బిందువులు. గబగబా ఒకదానివెంట ఒకటి రాలుతూ, అంతా కలిసి ఒక పూసల తెరలా అగుపడుతున్నది. ఆ తెరలోనుంచి అల్లంతదూరంలో రోడ్డుకు అవతల ఎదురింట్లో ఇంజనీరుగారి పెద్దకుమార్తె చంటిపిల్లవాడికి పాలిస్తూ కనిపించింది.

సీతాపతి కుర్చీలో కొద్దిగా కదిలాడు.

తన కమలకు కూడా మగపిల్లాడు పుట్టాడు, కొంతకాలానికి. కాని ఆ కాన్పుతో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. ఎప్పటిలా తనుమాత్రం తన ఉద్యోగం మిషతో ఎక్కువగా పట్టించుకోలేదు. ఆమెను ఆమె అన్నయ్యగారింటికి పంపించేశాడు. ఆ తరువాత....ఆ తరువాత ఆమె....కొన్నాళ్లకు......

సీతాపతి కళ్లనుంచి నీళ్లు బొటబొటా రాలాయి. వాన జోరు తగ్గింది. వాన జల్లు మాత్రం మిగిలింది. హోరుగాలి, చలిగాలి విర్రవీగుతూంది. మంచుబిందువుల్లా చిన్న చిన్న తుంపరలు వీగే గాలికి విసురుగా ముఖంలోకి గాజుముక్కల్లా తగులుతున్నాయి. సీతాపతి మడతకుర్చీ మడిచి వసారాలోనే నిలబడ్డాడు.

రోడ్డుమీదికి మళ్లీ చేరింది కుర్రకారు. మూడేళ్ల కుర్రాడొకడు జారిపడి ఏడుస్తున్నాడు. సీతాపతికి వాణ్ణి దగ్గరికి తీసి సముదాయించాలనిపించింది. ఇప్పుడతనిలో పిత్ర వాత్సల్యం పొంగుతూంది. అతనికి ఈ కాంక్ష కలగడం ఇదే మొదటిసారి కాదు. మునలితనంలో అందరికీ కలిగే ఆశే అతనికీ కలిగింది. కాని అతని విషయంలో ఈ ఆశ ఆశగానే మిగిలిపోగల దుస్థితి!

తనను వదిలిపోయిననాటినుంచీ తనెప్పుడూ తన కొడుకును గురించి అనుకోలేదు. వాడి చదువూ సంధ్యా సమస్తం వాడి మామయ్య చేతిమీదిగానే జరిగిపోయింది. ఆ ఇంట్లో ఆయన బతికి ఉన్నంతకాలం, తండ్రీ కొడుకులు ఒక్క ఇంట్లో నివసించలేదు. మామయ్య ప్రాపుతప్పిన తరువాతనే కొడుకు తండ్రిని చేరాడు. తండ్రి ప్రవర్తన కొడుకుకు తెలియందికాదు. తండ్రి ఇంట్లో ఎక్కువకాలం ఉండడు. ఎప్పుడూ కాంపులే. అందులోనే అతనికి ఆనందం. తండ్రికి నచ్చ చెప్పాలని, మంచి చేయాలని కొడుకు ఉబలాటం. తండ్రికి కొడుకంటే ఒట్టి మూర్ఖుడనే భావం. కాబట్టే ఇంట్లో ఉన్న కొద్దిసేపూ వారిరువురి మధ్యా ఘర్షణ తప్పలేదు. తత్ఫలితంగా కొడుకు తండ్రినుంచి దూరమయాడు. ఇంతకన్నా ఎక్కువ సత్యం సీతాపతికి తెలుసు. తనే తనయునికి దూరం కావడానికి ప్రయత్నించి, సఫలుడైనాడు. అందుకనే ఇప్పుడు పరితపిస్తున్నాడు వాడికోసం.

పదేళ్లనుంచీ తండ్రికి, కొడుకుకు ఎలాంటి సంబంధమూలేదు. ఒకరి ఉనికి ఒకరికి తెలియని స్థితి. ఈ స్థితిలో తండ్రి కొడుకుకోసం ఎదురు చూడడం ఉన్మత్తత. అంతకన్నా విపరీతమైనది అతను వాడినుంచి ఉత్తరాలకోసం పడిగాపులు కాయడం. కాని అతని నమ్మకం అతనికి ఉంది. అది ఇతరులకు అర్థంకాదు. విశ్వకవి రవీంద్రుని 'పోస్టాఫీసు'లోని చిన్నదాని నమ్మకంలాంటిదది.

అవునన్నట్లు ఆకాశం ఆర్భాటంగా విరిగింది. విరిగి ఏడ్చింది. కుండపోతగా వర్షం. వాన వాలుగా కురుస్తుంటే సీతాపతి వసారా కొనకు వచ్చి నిలబడ్డాడు. పక్కింటి అరుగుమీద ఆ ఇంటి కొత్త కోడలు ఆకాశంవైపు చూస్తూ నిలబడి ఉంది. కోడలిని అత్తగారు కేకేసింది—"శారదా" అని.

ఆ పేరు సీతాపతి చెవులను ఛేదించుకుని వినపడింది. చిట్లినట్లు ఒక్కసారి గగుర్పొడిచింది అతని శరీరం. హృదయంలో ఆ పేరు

కేశరాజు రాధాకృష్ణ

## అర్పణ

శ్రీమతి పి రామలక్ష్మి రచించిన నవల 'అర్పణ' ప్రచురణ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1965 ఫిబ్రవరి 3 వ తేదీ సంచికలో ప్రారంభం అవుతుందని తెలియపరచడానికి ఆనందిస్తున్నాము.

ఎడిటర్

అనన్య సామాన్య
ప్రచారంగల
తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర
వారపత్రిక

పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

పాదాలలో ఆనెలు
పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్ళు పాతుకు పోయి పాదము నేలపై బెట్టలేక రాళ్ళు తగిలిన త్రుళ్ళిపడువారు పైపూతగా వాడినచో వ్రేళ్ళతో సహా మాయంచేయగల సంజీవి వెల పోస్టు ఖర్చులతో రు. 5—50 న. పై.
కొక్కోకము చిత్రపటములుగలదిరు. 1—50
దాంపత్య రహస్యములు రు. 3—00
తెలుగు హిందీ స్వయంశిక్ష రు. 4—50
తెలుగు-ఆంగ్ల భాషాబోధిని రు. 5—00
పోస్టు ఖర్చులు ప్రత్యేకము.
ప్రభ అండ్ కో
8, మలయపెరుమాళ్ వీధి, మద్రాసు-1

# వానజల్లు

వెయ్యిమార్లు ప్రతిధ్వనించింది. పిడచ గట్టుకుపోయింది అతని గుండె. అలాగే గోడకు జారగిలపడి కూలబడిపోయాడు నీరసంగా. అతని లోని సగం జీవనానికి జీవంలేదు. మూసిన అతని కళ్ళముందు ప్రపంచం వెనక్కు తిరిగింది. భయంకరంగా మళ్ళీ కోరలు సాచింది భూతం.

ఆరేళ్ళనాటి సంఘటన అది—

ఆ రాత్రి, తన పాపం పరిపక్వమైన రాత్రి, తన పాపిష్ఠి కళ్ళకు పొరలు కమ్మిన రాత్రి, ఆ కటిక రాత్రి ప్రళయంగా ఉరుములతో, పిడుగులతో కురుస్తున్న వర్షంనుంచి, బీభత్సమైన ప్రకృతినుంచి తనను తప్పించి తలదాచుకోనిచ్చింది ఆమె. కాని తను నీచాతినీచంగా ప్రవర్తించాడు.

సీతాపతి నరాలు బిగుసుకున్నాయి. బలవంతంగా కళ్ళు తెరుచుకున్నాడు. ఆ సంఘటనను అతని మనస్సు బలవంతంగా తుడిచివేయటానికి ప్రయత్నిస్తున్నది. కానీ....

కాని, విధి శారదను తన క్రూరత్వంనుంచి తప్పించింది. ఆమె పుణ్యవతి. తన కళ్ళు తెరిచింది. తనను తానే ఆ క్షణం అసహ్యించుకున్నాడు. అవమానంతో కుంగిపోయాడు. ఆ అసహ్యం, ఆ అవమానం ఈనాటికీ అతణ్ణి ఇనుపకవచంలా అంటిపెట్టుకుని ఉన్నాయి. ఆ పాపం అతన్ని పిశాచంలా వెన్నాడింది. ఘోరమైన, ఘోరమైన ఒంటరితనాన్ని మిగిల్చింది. అతను చేసిన పాపాలే అతనికి తోడునీడగా మిగిలాయి. రెండు కన్నీటి చుక్కలుమాత్రం రాలాయి. అతను భోరుమని బాధతీరేలా ఏడవలేడు. హృదయం నిండుగా కన్నీళ్ళు. ఆ నిలిచిపోయిన కన్నీళ్ళలో నాని, నాని అతనిబాధ మరింత కుళ్ళుతూంది.

కడకు కాలం కనికరించింది. సీతాపతి కళ్ళ నుంచి జలజలా కన్నీళ్ళు రాలాయి.

* * * *

ఒక్కోసారి ఒక్కొక్క జీవితంలోకి నిమిత్తమాత్రులుగా కొందరు ప్రవేశించి ఆ జీవితాన్నే ఒక్క మలుపు తిప్పుతుంటారు. సీతాపతి జీవితంలో అలాంటి వ్యక్తే నరసింహం. ముఖాముఖి ఒకరొకరికి తెలియదు. విధి అనుకూలించింది. తండ్రి కొడుకును చేరబోతున్నాడు. ఈ అవకాశానికి సూత్రధారుడైనాడు నరసింహం. కాకతాళీయంగా కొడుకును చూసిన నరసింహం తండ్రి ఉనికి తెలిపాడు. తండ్రిని ఆహ్వానించాడు కొడుకు. ఇది దైవ నిర్ణయం. నరసింహం కేవలం నిమిత్తమాత్రుడు. అయినా సీతాపతి మనస్సు అతనికి కృతజ్ఞతతో నమస్కరించింది.

ఊగులాడుతూ ఊగులాడుతూ పరిగెడుతున్న రైల్లో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు సీతాపతి సంతోషంతో. అతనిలో వెర్రి ఆనందం వెయ్యి పడగలెత్తి ఆడుతూంది.

మూసిన గాజు కిటికీలోనుంచి చూస్తుంటే అర్థంలేని వాన వింతగా అగుపిస్తూంది. అలాంటి వానజల్లుతో నిండినదే సీతాపతి జీవితం. ఆ వానజల్లులో తడిసి, తడిసి అతని జీవితమే ఒక బురద మడుగులా తయారయింది. ఈనాటికి సూర్యరశ్మి సోకుతున్నది అతని జీవితంలోకి. ఊబిలాంటి ఆ బురదలోనుంచి బయటపడాలని తహతహలాడే అతనికి, ఈనాటికి, కొడుకు అనే రూపంలో ఒక ప్రాపు దొరుకుతూంది. తన కొడుకుతో, కోడలితో, ముద్దులొలికే అల్లరి మనమడితో అతను తన జీవిత శేషాన్ని హాయిగా గడిపేయగలడు. అతనికిక ఒంటరితనం ఉండదు. ఆ ఒంటరితనంలో అతణ్ణి రాబందులా పీక్కుతినే గతం అతనినుంచి ఇక దూరమవుతుంది.

ఈ వెర్రి ఆలోచనలనుంచి ఉలిక్కిపడ్డాడు సీతాపతి రైలు కుదిపిన కుదుపుతో. రాబోయేదే తను దిగవలసిన ఊరు. సీతాపతి పెట్టె, పంచి సర్దుకున్నాడు. ఇంకా ఎవరో నలుగురైదుగురు దిగేలా ఉన్నారు. సీతాపతి నెమ్మదిగానే దిగుదామని కూర్చున్నాడు మళ్ళీ.

ఆకాశంలో మేఘాలు గర్జిస్తున్నాయి. వాన ఎక్కువయింది. రైలు పెద్దగా కూతవేసింది. కాస్సేపటికి ప్లాట్‌ఫారంమీదికి జోగాడుతున్నట్లు చేరి ఆగింది రైలు. సీతాపతి కళ్ళు చేటలంతై, గాజు కిటికీలోనుంచి వెదుకుతున్నాయి ప్లాట్‌ఫారాన్ని. అడుగో, అడుగో....తన కొడుకు! గొడుగు తెరుచుకుంటున్నాడు. ఆ పక్కన మూడేళ్ళ కుర్రాడు—తన మనమడు— వాడి చెయ్యి వదలడంలేదు.

పిల్లాడిని వాడి తల్లి—తన కోడలు....తన కోడలు, ఎవరు తనకోడలు?

ఒక క్షణం నిర్విణ్ణుడైన సీతాపతికి మరవలేని ఆమె ముఖం ప్రస్ఫుటంగా తెలిసింది. అతని నవనాడులూ కుంగిపోయాయి. కళ్ళు చీకట్లు కమ్మాయి. ఆ క్షణం స్తంభించిపోయింది.

ఆ స్థితిలో, పొరబాటుననయినా తన కొడుకు తనను చూడకూడదని, దైవాన్ని అతని మనస్సు ప్రార్థించింది. ముఖం చాటు చేసుకున్నాడు.

వానజల్లును చీల్చుకుంటూ రైలు భారంగా కదిలింది. దిగాలుపడిపోయిన భర్తను—"ఆయన రాలేదా?" అని అడుగుతున్న తన కోడలును—శారదను—హృదయపూర్వకంగా ఆశీర్వదించి దీవించాడు సీతాపతి. ★